క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గొలుగొండ: ముంగర్లపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు, డ్వాక్రా మహిళలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల మంచి దిగుబడి, తక్కువ ఖర్చు, ఆరోగ్యకరమైన ఆహారం వస్తుందని ఐసీఆర్‌పీ ప్రతినిధులు సత్యనారాయణ, బుచ్చమ్మ తెలిపారు. మన పరిసర ప్రాంతాల్లో దొరికే ఆవు మూత్రం, వేప, బొప్పాయి, సీతాఫలం వంటి వాటితో బ్రహ్మాస్త్ర కషాయం తయారీపై అవగాహన కల్పించారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను అందజేస్తున్న పీఆర్టీయూ నేతలు

మాకవరపాలెం: పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ మేరకు మండల కార్యదర్శి త్రిమూర్తులు, కె.రాము శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



ప్రహరీని ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. నారాయణరాజుపేట పంచాయతీ భవనానికి నూతనంగా నిర్మించిన ప్రహరీని ఆయన శుక్రవారం ప్రారంభించారు. రూ.4.5 లక్షలతో ఈ ప్రహరీని నిర్మించినట్టు సర్పంచ్ పీలా వరలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణశ్రీ, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టరు మూర్తి

గొలుగొండ: అతివేగం ప్రమాదకరమని, పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్లడం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నర్సీపట్నం మోటార్ వెహికల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీఆర్ మూర్తి తెలిపారు. కృష్ణదేవిపేటలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుకు లైసెన్సు, ఇన్సూరెన్సు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

విరబూసిన బ్రహ్మ కమలాలు



అరగంట ముందు మొగ్గగా..



గంట వ్యవధిలో విరిసిన బ్రహ్మ కమలం

దేవరాపల్లి: స్థానిక చిన్నంనాయుడు నగర్‌లోని ఏఎన్‌ఎం ముంతాజ్ బేగం ఇంటి పెరటిలో శుక్రవారం రాత్రి అరుదైన బ్రహ్మ కమలాలు విరబూశాయి. విరబూసిన సమయంలో సువాసన వెలువడినట్టు ఆమె తెలిపారు. శ్రావణ లక్ష్మీ అత్యంత ఇష్టమైన బ్రహ్మకమలాలు శ్రావణ శుక్రవారం రోజున తమ ఇంట్లో విరబూయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వీటిని పరిసర ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

కల'వరి'మాయే 'మడి'లో..

- కళ్యాణపులోవ రిజర్వాయర్‌లో సమృద్ధిగా సాగునీరు
- విడుదల చేయడంలో జాప్యం
- ఆయకట్టులో వడలిపోతున్న నారుమడులు
- వర్షాభావంతో రైతుల ఆందోళన



రిజర్వాయర్‌లో సమృద్ధిగా నీరు



కొత్తకోటలో ఎండిపోతున్న నారు మడి



ఎండిపోతున్న దమ్ముపట్టిన మడి



దారగెడ్డ ఆయకట్టు వరి పొలాలు

రావికమతం: ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు తోడు కళ్యాణపులోవ రిజర్వాయర్‌లో సమృద్ధిగా నీరు ఉందన్న ధైర్యంతో ఖరీఫ్ సాగుకు దిగిన రైతులు కలవరం చెందుతున్నారు. పక్షం రోజులుగా వేసవిని తలపించేలా కాస్తున్న తీవ్రమైన ఎండలకు వరి నారుమడులు వడలిపోతున్నాయి. దాంతో రిజర్వాయర్ నీటిని త్వరగా విడుదల చేయాలని ఆయకట్టు గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఏటా ఈ నెలలో 1-5వ తేదీ మధ్య నీటిని లాంఛనంగా విడుదల చేసేవారు. ఈ ఏడాది పదో తేదీ దాటినా నీటిని విడుదల తేదీని ప్రకటించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే మండిపోతున్న ఎండలకు గంపవానిపాలెం, కొత్తకోట, టి.అర్జాపురం, జెడ్.కొత్తపట్నం, ఒమ్మవరం తదితర గ్రామాల్లో వరి నారుమడులు వడలిపోతున్నాయి. కొత్తకోట, దొండపూడి ప్రాంతాల్లో ఇటీవల వర్షాలకు పట్టిన దమ్ము మడులు సైతం ఎండిముఖం పట్టాయి. పక్షం రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో పాలుపోవడం లేదని రైతులు దాసరి ఈశ్వరరావు, తాతబాబు, కొమ్ము నాయుడు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ నీటిని తక్షణం విడుదల చేస్తే నారుమడులను రక్షించుకునేందుకు అవకాశం ఉంటుందని వాపోతున్నారు.

రిజర్వాయర్‌లో 452 అడుగుల మేర నీరు

11 గ్రామాల్లో ఐదు వేల ఎకరాలకు నీరందించే కళ్యాణపులోవ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 460 అడుగులు, ప్రస్తుతం 452 అడుగుల మేర నీరుంది. ఈ నీరు విడుదల చేస్తే, ఆపై వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని రైతులు చెబుతున్నారు. నాలుగేళ్లుగా ఇలాగే జరుగుతోందని అంటున్నారు.

ఆందోళనలో వరి రైతులు

గొలుగొండ: భారీ వర్షాలు కురిశాయని అన్ని ప్రాంతాల్లో వరినాట్లు వేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వారం రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో దారగెడ్డ, బోరింగ్, బొడ్డేరు గెడ్డల దిగువున నాలుగువేల ఎకరాల్లో వేసిన వరినాట్లు ఎండుముఖం పడుతున్నాయి. ఇప్పటి వరకు గెడ్డల నుంచి పారుతున్న సాగునీరుతో కొంతవరకు కాపాడుకుంటూ వచ్చారు. పది రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతోపాటు తీవ్ర ఎండలు కాయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఈ నెలలో భారీ వర్షాలు కురవడంతో ఇక్కడ పంటలకు ఇబ్బందులు ఉండేవికావు. తాండవ జలాశయానికి ప్రధాన ఆధారమైన గెడ్డల నుంచి చుక్కనీరు ప్రవహించ లేదు. భారీ వర్షాలు కురిస్తే తప్ప ఇటు గొలుగొండ మండలానికి అటు నాతవరం మండలానికి సాగు నీరు అందే అవకాశం లేదని వాపోతున్నారు.

ఎండిపోయిన నారుమడి



రెండెకరాల్లో రెండున్నర బ్యాగులు ఆర్జీఎల్ రకం విత్తనాలు పోశా. ప్రస్తుతం ఎండలకు నీరు లేక సమూలంగా ఎండిపోయింది. రిజర్వాయర్ నీరు ఈ పాటికే వదిలి ఉంటే కాపాడుకుని ఉండేవాడ్ని. ఇప్పటికైనా నీరు విడుదల చేయకుంటే నారుమడులు ఎండిపోయే ప్రమాదముంది.

– దాసరి ఈశ్వరరావు, రైతు, కొత్తకోట

అక్విడెక్ట్ పనుల వల్లే జాప్యం..

రిజర్వాయర్ ప్రధాన కాలువలో చీమలపాడు, ములకలపల్లి వద్ద రెండు అక్విడెక్ట్‌లు పదేళ్లుగా పాడై నీరు వృథాగా పోయేది. ఏడాది క్రితం గండీ కొట్టేసింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి రూ.9,95,000 మంజూరు చేశారు. ఈ నిధులతో ములకలాపల్లి వద్ద అక్విడెక్ట్‌కు రూ.4,95,000తోనూ, చీమలపాడు వద్ద అక్విడెక్ట్‌కు రూ.5 లక్షల ఖర్చు చేసి ఈ ఏడాది పనులు చేపట్టాం. పూర్తి కావచ్చాయి. ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లి రెండు రోజుల్లో నీరు విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– సత్యనారాయణ దొర, ఇరిగేషన్ ఏఈ, కొత్తకోట సెక్షన్

ఎండుతున్న నారుమడులు, వరినాట్లు



రోలుగుంటలో ఎండిపోయిన వరి నారుమడి

రోలుగుంట: వర్షాభావ పరిస్థితులతో నారుమడులకు, వరినాట్లకు నీరులేక వడలిపోతున్నాయి. ఈ ఏడాది మండల వ్యవసాయ శాఖ రైతులకు కావాల్సిన వరి విత్తనాలను గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై 40 క్వింటాళ్లపైగా పంపిణీ చేశారు. ఆకుపోతలు వేసుకున్న సమయంలో చిన్నపాటి వర్షాలు పడి నారుమడులు కళకళలాడాయి. దీంతో కొమరవోలు, శరభవరం, బుచ్చింపేట చెరువు ఆధారిత ప్రాంతాల్లో వరి నాట్లు వేశారు. ఇంకా వర్షాలు పడతాయని ఆశతో భోగాపురం, కంచుగుమల, రోలుగుంట తదితర గ్రామాల్లో బురద మడుల్లోనే వరినాట్లు వేసుకున్నారు. చాలా చోట్ల అవసరం మేర భూముల్లో నీటి నిల్వలు లేక దమ్ములు చేసుకోలేదు. ఇదిలా ఉండగా రోలుగుంట, కొండపాలెం, వెలంకాయలపాలెం తదితర గ్రామాల్లో ఈ వారం కాసిన ఎండలకు వరినారుమడులు ఎండిపోతున్నాయని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మాడుగులలో సత్యసాయి రథం ఊరేగింపు



పుటపర్తి సత్యసాయి రథాన్ని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: పుట్టపర్తి నుంచి పలు జిల్లాలు దాటుకుని శుక్రవారం సాయంకాలం పుట్టపర్తి సత్యసాయి రథం మాడుగుల చేరుకుంది. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. గ్రామంలో ప్రతి వీధిలో స్వామివారి రథం ఊరేగించారు. అనంతరం సత్యసాయి మందిరం వద్ద ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు.

తారురోడ్డు నిర్మాణానికి భూమి పూజ



తారురోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సుధారాణి

దేవరాపల్లి: కలిగొట్ల శివారు బందారుపాలెంలో తారురోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి శుక్రవారం భూమి పూజ చేశారు. కలిగొట్ల, అర్జునగిరి రోడ్డు నుంచి బందారుపాలెం వరకు 1.51 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ. 87 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టే తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే తమ కష్టాలు తొలగనున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి



పింద్రంగిలో పాడి రైతులకు మందులను అందిస్తున్న పశువైద్యాధికారి నాయుడు



పశువులకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి నూకేశ్వరరావు

కె.కోటపాడు: వర్షాకాలంలో రైతులు పశుపోషణలో జాగ్రత్తలను పాటించడం ముఖ్యమని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. శుక్రవారం పింద్రంగిలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 పశువులకు గర్భకోశ చికిత్సలు, 11 పశువులకు సాధారణ చికిత్సలతోపాటు 18 పెయ్యిలకు నట్టల నివారణ మందు అందించారు. వీటితోపాటు 240 ఆవుజాతి పశువులకు లంపీస్కిన్ వ్యాధినిరోధక టీకాలు వేశారు. పశువులను వర్షాకాలంలో పరిశుభ్రంగా ఉంచే ప్రాంతాల్లో ఉంచాలని సూచించారు.

85 పాడి పశువులకు చికిత్సలు

రోలుగుంట: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కంచుముల గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 85 పశువులకు రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వరరావు పరీక్షించారు. పాడిరైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన సీజనల్‌గా పశువులకు సంక్రమించే ముద్ద చర్మవ్యాధి, గొంతువాపు, గర్భకోశ వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

350 పశువులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు

దేవరాపల్లి: మండలంలో నాగయ్యపేట, సీతంపేటలో 350 పశువులకు లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేశామని ఎం. అలమండ పశువైద్యాధికారి కె.మంజూష తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ టీకాలు రైతు భరోసా కేంద్రాలు, పశు వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని, రైతులు తమ పశువులకు వేయించాలని సూచించారు.

శిక్షణ కేంద్రం ఏర్పాటు



సాగు వనరులను ప్రదర్శించిన మాస్టర్ ట్రైనీ దేవి

రోలుగుంట: ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొంతలంలో సాగు వనరుల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ కషాయాలు, జీవామృత వనరులు, కూరగాయలు, విత్తనాలు, నవధాన్యాలు తదితర అవసరమైన వనరులను ప్రదర్శించారు. వాటి వినియోగం గురించి మాస్టర్ ట్రైనీ బత్తి దేవి వివరించారు. సాంబమూర్తి, మోదినాయుడు, నాగకాంతం, రాంబాబు పాల్గొన్నారు.

రూ.1.87 కోట్ల సున్నా వడ్డీ మంజూరు

మాడుగుల రూరల్: వైఎస్సార్ సున్నా వడ్డీ కింద మండలంలోని స్వయం సహాయక సంఘాలకు రూ.1.87 కోట్లు మంజూరైందని వైఎస్సార్ క్రాంతి పథ ఏపీఎం సీహెచ్ అప్పలనర్సమ్మ శుక్రవారం తెలిపారు. వరుసగా నాలుగ విడతగా మండలంలోని 1,522 స్వయం సహాయ సంఘాలకు చెందిన 17,002 మంది సభ్యులకుగాను ఈ మొత్తం వారి బ్యాంకు ఖాతాలకు జమకానుందన్నారు.

పంచభూతాలను పరిరక్షించుకోవాలి



నా భూమి- నా దేశం శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం: జీవకోటి మనుగడకు జీవనాధారమైన భూమి, నీరు, గాలి, ఆకాశం కలుషితం కాకుండా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అన్నారు. శుక్రవారం యరకన్నపాలెంలో నిర్వహించిన నా భూమి- నా దేశం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంచభూతాలను కలుషితం చేయడం వల్ల మానవాళి జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. అనంతరం శిలాఫలాకాన్ని ఆవిష్కరించి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణమ్మ, ఉప సర్పంచ్ శేఖర్, ఏవో రమణబాబు, ఏపీఎం నానిబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నెలాఖరులోగా 136 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి



నాతవరంలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నాతవరం: నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లో ఈ నెలాఖరులోగా 136 రెవెన్యూ గ్రామాల్లో జగనన్న భూరక్ష రీసర్వే పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఆర్డీవో హెచ్‌వీ జయరాం తెలిపారు. నాతవరంలో ఇంటింటా ఓటర్ల సర్వేను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు పోలింగ్ కేంద్రాల్లో ఇంటింటికి వెళ్లి ఏవిధంగా సర్వే చేస్తున్నారని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తర్వాత సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాజకీయ నాయకులను వెంట తీసుకెళ్తే క్రిమినల్ కేసు పెడతామని హెచ్చరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో 262 పోలింగ్ కేంద్రాల్లో సర్వే చురుగ్గా సాగుతుందన్నారు. అదేవిధంగా డివిజన్‌లో మొదట విడత కింద 50 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూముల సరిహద్దులో జగనన్న భూరక్ష -2020 రాళ్లు 31 వేలకు పైగా ఏర్పాటు చేశామన్నారు. వీటికి సంబంధించి కొత్త పాసుపుస్తకాలు ఉచితంగా జారీ చేస్తున్నామన్నారు. రెండో విడత కింద 136 రెవెన్యూ గ్రామాలు ఎంపిక చేయగా, ప్రస్తుతం వందకు పైగా రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, లక్షకు పైగా భూరక్ష రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. డి.పట్టా భూముల్లో 20 ఏళ్లకుపైగా అనుభవంలో ఉన్న రైతులకు హక్కు కల్పిస్తుందన్నారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

రేపు గడపగడపకు ముగింపు విజయోత్సవ సభ

విజయవంతం చేయాలని విప్ ధర్మశ్రీ పిలుపు



రోలుగుంటలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సభాస్థలిలో షామియానాల ఏర్పాటు

బుచ్చెయ్యపేట/రోలుగుంట: చోడవరంలో గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. శుక్రవారం బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి కల్యాణ మండపంలోనూ రోలుగుంటలోనూ వేర్వేరుగా పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు కార్యక్రమంలో ఎండనక, వాననక తనతో పాల్గొన్న అధికారులకు, నాయకులకు, వలంటీర్లకు ధర్మశ్రీ అభినందనలు తెలిపారు. ఆదివారం ఉదయం చోడవరం కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే విజయోత్సవ సభలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితోపాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ముఖ్య నాయకులు పాల్గొంటారన్నారు. రెండు మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. బుచ్చెయ్యపేట కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, మాజీ సర్పంచ్ గొంపా అప్పారావు పాల్గొన్నారు. రోలుగుంట కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, రోలుగుంట ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, పార్టీ మండల నాయకులు గొర్లె చెల్లంనాయుడు, శెట్టి సత్యనారాయణమూర్తి, రోలుగుంట పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మడ్డు తాతబాబు, కుంచంగా హరిబాబు, బగుదు వెంకటరమణ పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న సభాస్థలి

చోడవరం రూరల్: అసెంబ్లీ నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సంపూర్ణం చేసుకున్న సందర్భంగా ఆదివారం భారీ స్థాయిలో విజయోత్సవ సభ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వ విప్, శాసన సభ్యుడు కరణం ధర్మశ్రీ కంకణ బద్ధులుగా పని చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులతో సమావేశాలు నిర్వహించి, చోడవరం సభ ప్రాధాన్యతను దానిని విజయవంతం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించి, అందుకు తగ్గ విధంగా ఎవరెవరు ఏఏ పనులు చేయాలన్న అంశాల వారీగా సమాలోచనలు జరిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్న పాఠశాల ఆట స్థలంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుంచి కనీసంగా 20 వేల మంది పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రభుత్వ సంక్షేమ ఫలాల లబ్ధిదారులు హాజరు కాగలరన్న అంచనాతో అందుకు తగినట్టుగా సభా స్థలిలో షామియానాలతో పటిష్టమైన ఇనుప చలువ పందిరి వేయిస్తున్నారు. సభకు హాజరైన జనం అసౌకర్యానికి గురి కాకుండా కూర్చునేందుకు వీలుగా తగినన్ని కుర్చీలను సమకూర్చారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం కలిపించనున్నట్టు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు భద్రతా, జాగ్రత్తలను పాటించనున్నామని చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు సాక్షికి తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు సభాస్థలికే నియోజకవర్గ శ్రేణులన్నీ చేరుకుంటాయని, సభ మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. జాతీయ జెండా పండగకు మూడు రోజులు గడువుంటే, తమ పార్టీకి మాత్రం రేపే జెండా పండగ అన్నంత సమరోత్సాహంతో పార్టీ శ్రేణులు అహర్నిశలు కృషి చేస్తున్నట్టు చెప్పారు.

మూడు మంచినీటి బోర్లు ప్రారంభం



కొమళ్లపూడిలో మంచినీటి బోరును ప్రారంభిస్తున్న నాయకులు



పూలగరువులో బోరు తవ్వకానికి పూజలు చేస్తున్న ఎంపీటీసీ కోలా వెంకటరమణ

బుచ్చెయ్యపేట: సీఎల్సీ చర్చి ఆధ్వర్యంలో మండలంలోని కొమళ్లపూడిలో రెండు, గున్నెంపూడిలో ఒక బోరును నాయకులు శుక్రవారం ప్రారంభించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సీఎల్సీ చర్చి నిర్వాహకుడు రాబర్ట్ మహంతి, సర్పంచ్ ముచ్చకర్ల హరిణి అప్పారావు ఈ బోర్లను ప్రారంభించారు. గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీరుస్తున్న సీఎల్సీ చర్చి సేవలను అభినందించారు. వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్ గేదెల వెంకయమ్మ, గోకివాడ వరకృష్ణ, నాయకులు ఈశ్వరరావు, వేపాడ మధు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు భూమి పూజ

దేవరాపల్లి: గిరిజన పంచాయతీ వాలాబు శివారు పూలగరువులో తాగునీటి బోరు తవ్వకానికి రిగ్ వద్ద ఎంపీటీసీ కోలా వెంకటరమణ(గోపి) శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. బోరు తవ్వకానికి జెడ్పీ జనరల్ గ్రాంట్ నుంచి రూ.లక్ష మంజూరు చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే జలజీవన్ మిషన్ పనులు చేస్తున్నామన్నారు. పోడెల నానిబాబు, వార్డు మెంబర్ డి. జమ్మునాయుడు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేడుకగా నా భూమి-నా దేశం

మాకవరపాలెం: మండలంలోని 11 పంచాయతీల్లో నీ భూమి-నా దేశం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్మించిన శిలాఫలకాల వద్ద ప్రజా ప్రతినిధులు, అధికారులు అమర వీరులను స్మరిస్తూ నివాళులర్పించారు. ప్రతి పంచాయతీలోనూ 75 మొక్కల చొప్పున నాటారు. మునిడిపాలెం, బూరుగుపాలెం, ఎస్.ఆర్.పేటలోని కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ పాల్గొన్నారు. రాచపల్లిలో జెడ్పీటీసీ సభ్యురాలు పెట్ల సత్యవేణి, వైస్ ఎంపీపీలు లక్ష్మి, రాజారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, పార్టీ నాయకుడు భద్రాచలం, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో గొలుగొండలో నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కసిపల్లి అప్పారావు, ఎంపీటీసీ చేపల చిన పాప, మాజీ ఎంపీపీ కుంత్సం లక్ష్మీనారాయణ మొక్కలు నాటారు. జోగుంపేటలో వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్ జువ్వల లక్ష్మీ ఆధ్వర్యంలో అమరవీరులకు గుర్తుగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

మొక్కలు నాటి మాతృభూమి రుణం తీర్చుకుందాం

దేవరాపల్లి: ఆజాదీకా అమృత్ మహోత్సవాలలో భాగంగా ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి మాతృభూమి రుణం తీర్చుకుందామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు అన్నారు. బోయిలకింతాడలో ఆయన శిలాఫలకం ఆవిష్కరించి, స్థానికులతో కలిసి మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. మండల వ్యవసాయ శాఖ సలహా సంఘం చైర్మన్ అన్నం, బొబ్బిలి రాము, పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావు పాల్గొన్నారు. వేచలంలో సర్పంచ్ నాగిరెడ్డి శరారి నాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆర్.వి.కె. నాయుడు శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. అనంతరం స్థానిక నాయుకులు, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

మాడుగుల: కింతలి వల్లాపులో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి ఆధ్వర్యంలో నా భూమి - నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై దేశనాయకులు చిత్రపటాలు అమర్చి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు.

మాడుగుల రూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎం. కోటపాడులో నా భూమి నా దేశం శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులు గట్ల మీద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, సర్పంచ్ శానాపతి శేష ఫణి, ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్, మండల పరిషత్ పరిపాలనాధికారి గోపాలరాజు, పంచాయతీ కార్యదర్శి తిరుమలదేవి, తదితరులు పాల్గొన్నారు. జి. అగ్రహారంలో సర్పంచ్ నందారపు మంగమ్మ, ఎంపీటీసీ ఆర్లె మాధవి, ఆర్లె నాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు. సాగరంలో సర్పంచ్ కోట్ని జయమ్మ, సన్యాసినాయుడు, ఎంపీటీసీ శ్రీనాధు సూర్యకాంతం, జగ్గారావు, ఎం.కె. వల్లాపురంలో ఉప సర్పంచ్ కరణం రాము ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.